ప్రచురణ పూర్తయ్యేవరకూ ఈ దశాబ్దపు అత్యంత సెన్సేషనల్ వార్తని అత్యంత రహస్యంగా ఉంచటానికి ఏర్పాట్లు జరిగాయి.

ప్రచురణ సంగతి పరమేశ్వరానికి తెలిసింది తన చేతికందిన సెట్టే ప్రచురిత మవుతుందనుకున్నాడు. ప్రమాదం లేదు కాబట్టి దాన్ని గురించి పట్టించుకోలేదు.

ఎంత మేధావి అయినా ఎక్కడో ఒకచోట తప్పు చేస్తాడు.

* * *

రామ్‌లాల్ తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు.

అతడికి క్రమక్రమంగా జరిగింది అర్థమయింది. చివరగా ఒక్క అనుమానం మాత్రం మిగిలింది.

నిన్న ప్రొద్దున్న ఎక్కడున్నారు? అని ఆడిగాడు భోజనం పూర్తి చేయగనే అందరికీ ఏదో మత్తు ఆవరించినట్టు అయిందనీ మెలకువ వచ్చేసరికి సాయంత్రమయిందనీ చెప్పింది.

దాంతో పూర్తిగా అర్థ మైంది.

విహారి ప్రవల్లికలు కలిసి ఎంత అద్భుతమైన ప్లాన్‌వేసి తనని ఫూల్‌ని చేశారో కూడా తెలిసింది.

మత్తులో వున్న భార్యాబిడ్డల్ని ఆస్పత్రికి తీసుకొచ్చి పైన ఎర్రరంగు జల్లి శవాల్లా చూపించారు. తన కాళికి బ్యాండేజీలు కట్టి తనిక ఎందుకూ పనికిరాడన్న ఫీలింగ్ కలుగచేశారు. ఆ భ్రమలోనే తను మొత్తం అంతా చెప్పేశాడు.

ఇప్పుడేం చెయ్యాలి?

శత్రువులకి తన ద్వారానే రహస్యాలు తెలిసిపోయాయన్న సంగతి స్వామికి ఎలానూ తెలుస్తుంది. ఇప్పుడు రెండే దార్లు.

భార్యా పిల్లలతో అండర్ గ్రౌండ్‌కి వెళ్ళిపోవడం.

లేదా స్వామి దగ్గరికి వెళ్ళి ఏదో సర్ది చెప్పడం.

రెండోదే మంచిదన్న అభిప్రాయానికి వచ్చాడు రామ్‌లాల్ రేపెలాగూ స్వామి ఈ దేశపు నియంత అవుతాడు. అప్పుడు తనెక్కడ దాక్కున్నా వెతికి పట్టుకుంటారు. ఇలా పడిపోవటం ద్వారా అనవసరంగా అనుమానాల్ని ఎక్కువ చేసినట్టు అవుతుంది. వెళ్ళి జరిగిన దాన్ని కాస్త మార్చి చెపితే సరి.

రామ్‌లాల్ వెనుదిరిగి ఆశ్రమానికి వెళ్ళాడు. ఎంత రాత్రయినా స్వామి అంత: పురాంతర్భాగంలోకి అతడికి ప్రవేశం వుంది. అతడు వెళ్ళే సరికి స్వామి పరమేశ్వరంతో మంతనాలు జరుపుతున్నాడు. మరుసటి రోజే విజయదశమి.

రేపు పేపర్లో రాబోయే న్యూస్ ఇది. దీనివల్ల మనకేం ప్రమాదం లేదనుకుంటున్నాను అంటూ పరమేశ్వరం ఒక ప్రతి ఇచ్చాడు. స్వామి దాన్ని చూసి ఇదే అయితే దీన్ని గురించి మనం

దానికోసం పత్రికాఫీసులమీద దాడి జరపవలసిన పనిలేదు. అది అనవసరంగా మనని మనమే అల్లరి చేసినట్టు అవుతుంది.

నేనూ అదే ఫీలవుతున్నాను అన్నాడు పరమేశ్వరం వార్తా ప్రతిని పక్కన పెడ్తూ నిజానికి అది విహారి అందజేసిన మొదటి ప్రతి.

వీళ్ళిలా మాట్లాడుకుంటూన్న సమయానికి రామ్‌లాల్ లోపలికి ప్రవేశించాడు.

ఇన్ని రోజులూ ఏమయ్యావు రామ్‌లాల్?

తనకి కాళ్ళు విరిగినట్టు విహారి ఎలా నాటకమాడాడో వివరించాడు రామ్‌లాల్. అయితే తను కొన్ని రహస్యాలని బయట పెట్టినట్లు చెప్పలేదు. తప్పించుకు వచ్చినట్టు చెప్పాడు.

నేను మీ ఇంటికి మనుష్యుల్ని పంపాను. నీ భార్యాపిల్లలు విషాహారం తిన్నట్టు ఏదేదో ఆస్పత్రిలో చేరినట్టు విన్నాను?

అవును. ఆస్పత్రిలో చేర్పించారట ఇప్పుడంతా బాగానే వుంది. ఇంటికొచ్చేశారు అన్నాడు.

స్వామి న్యూస్‌పేపర్ అతడి ముందుకు తోస్తూ ఈ ప్రకటన ఏమిటి? అనడిగాడు.

పన్నెండింటి వరకూ చూసి టిక్కెట్ బుక్ చేసేదము అని ఉన్న ప్రకటనది. రామ్‌లాల్ ఇరుకున పడ్డాడు ఒక అబద్ధాన్ని కవర్ చేసుకోవటానికి మరో అబద్ధం.

నాకు తెలీదు అన్నాడు మొహంలో భావాలు కవర్ చేసుకోవడానికి ప్రయత్నిస్తూ.

అంతలో బయట పోలీస్ సైరన్ వినిపించింది. ముగ్గురూ ముఖముఖాలు చూసుకున్నారు.

రెండు నిమిషాల తర్వాత సి.బి.ఐ చీఫ్ లోపలికొచ్చాడు.

అర్ధరాత్రి మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నందుకు క్షమించండి స్వామీ రామ్‌లాల్‌ని అరెస్టు చేయటానికి వచ్చాను.

ఏం నేరం మీద? పరమేశ్వరం అడిగాడు మొహం చిట్లిస్తూ.

పరబ్రహ్మ స్వరూపులయిన స్వామివారికి వ్యతిరేకంగా ఎన్నో దారుణమయిన ఆరోపణలు చేశాడు. ఏదో దీవిలో ఆయుధాల ఫ్యాక్టరీ కూడా వుందని చెప్పాడు పై నుంచి ఉత్తర్వులు వచ్చాయి ఇంటరాగేట్ చెయ్యమని.

స్వామి కాళ్ళు విస్ఫులింగాలయ్యాయి వాటికే గానీ శక్తివుంటే రామ్‌లాల్ అక్కడే మసి అయిపోయి వుండేవాడు. ఇప్పుడర్థమయింది గోల్డెన్ ఐలెండ్ రహస్యాలు ఎవరి ద్వారా బయట పడ్డాయో.

నేను చెప్పడం ఏమిటి? నాకేం తెలీదు అన్నాడు రామ్‌లాల్ కంగారుగా.

డాక్టర్లు విహారి డిప్యూటి అందరి దగ్గరా నువ్వు మాట్లడింది రికార్డయింది. రామ్‌లాల్ స్వామిలాంటి దేవుడి మీద నువ్వు చేసిన ఆరోపణల్లో నిజమెంతో కనుక్కోమని విహారి ఆ క్యాసెట్‌ని పై అధికారులకి పంపాడు. అందువల్ల ఇంత అర్ధరాత్రి ఆరాధ్యదైవాన్ని డిస్టర్బ్ చేయవలసి వచ్చింది సర అన్నాడు చీఫ్.

రామ్‌లాల్ పరిస్థితి ఇరుకున పడ్డట్టయింది. తనెంత తప్పు చేశాడో అర్థమయింది. పూర్తిగా విహారి పక్షాన అప్రూవర్‌గా వున్నా బావుండేది. లేదా భార్యా బిడ్డల్తో పారిపోయినా బావుండేది.

క్షణాల్లో అతడు ఫ్యూచర్ ప్లాన్ ఆలోచించాడు. మెరుపుకన్నా వేగంగా జేబులోంచి పిస్టల్ తీశాడు అవును నేను చెప్పినమాట నిజమే. నా వాళ్ళందర్నీ స్వామి చంపించాడన్న ఆవేశంలో అన్నీ చెప్పేసేను. ఇప్పుడు ఇంటరాగేషన్ పేరుతో మీ డిపార్ట్‌మెంట్ పెట్టే చిత్రహింసలు భరించే స్థితిలో లేను ఇంటరాగేషన్‌లో ఏమీ సాధించక మీరు వదిలేసినా నా వాళ్ళు నన్ను వదలరని నాకు తెలుసు ఇప్పుడు నాకున్నది ఒకటే మార్గం అందరూ చేతులెత్తండి.

ఓ ఆకస్మిక చర్యకి స్వామి తప్ప అందరూ నిశ్చేష్టులయ్యారు. ఈ పరిణామాన్ని ముందే వూహించినట్టు స్వామి నిర్మలంగా వున్నాడు. గోల్డెన్ ద్వీపం గురించిన విశేషాలు బయటకొచ్చినప్పుడే స్వామి అనుమానం తన ముఖ్య అనుచరుల మీదకు వెళ్ళడం. అది రామ్‌లాల్ అని ఇప్పుడు తేలింది.

రామ్‌లాల్ పరమేశ్వరం కణతకి పిస్టల్ ఆన్చాడు. ఇతడు నాతో వస్తాడు. నేను ఈ వూరునించి బయటపడేదాకా నాతో ఉంటాడు. మీరే మాత్రం ప్రయత్నం చేసినా ఇతని ప్రాణాలు పోతాయి అంటూ పరమేశ్వరాన్ని ద్వారం వేపు తోసుకెళ్ళాడు.

పోలీసు అధికారులు చీఫ్ అచేతనులయి చూస్తున్నారు స్వామి పెదవుల మీద చిరునవ్వు కదలాడింది.

రామ్‌లాల్ పరమేశ్వరాన్ని తీసుకుని బయటకు వెళ్ళబోతూ వుండాగా జరిగిందా సంఘటన కనురెప్పపాటులో అయిపోయింది.

ఆకాశం నుంచి పడే పిడుగు వేగంతో అది నేలకి తాకింది ..... మధ్యలో రామ్‌లాల్ నలిగిపోయాడు అతడి తల నిలువునా పగిలి నోటినుండి కేక కూడా రాకముందే ప్రాణం పోయింది నేలంతా గాజు అద్దాలు చెల్లా చెదురయ్యాయి. ఆ ప్రాంతమంతా నిండిన శబ్ద ప్రకంపనాలు ఎంత ధైర్యవంతుడి గుండెనయినా భయ కంపితుడిని చేసేట్టున్నాయి ఆ తరువాత వ్యాపించిన నిశ్శబ్దం మరింత భయకరంగా వుంది.

పరమేశ్వరం దిగ్భ్రాంతుడయి నిలబడిపోయాడు. రామ్‌లాల్ తాలూకు రక్తం అతడి మొహంమీద చుక్కలుగా చిమ్మింది పూలు జల్లినట్లు ఎదుటి శవంమీద రక్తంతో తడిసిన గాజు పెంకులు మెరుస్తున్నాయి. అంతా క్షణంలో జరిగిపోయింది. చివరి క్షణంలో చూశాడతను పైనుంచి షాండ్లియర్ జారటాన్ని పిస్తోలు నీడ ఏకాగ్రత నిలిపిన రామ్‌లాల్ దాన్ని చూసుకోలేదు అది జరిగే సమయానికి సరీగ్గా దాని క్రిందకి వచ్చాడు.

మృత్యువు అంత సమీపంగా రావటాన్ని చూడటం పరమేశ్వరానికి అదే మొదటిసారి.

అంతకు కొన్ని క్షణాల ముందే అన్ని సంవత్సరాలు కలిసి పనిచేసిన రామ్‌లాల్ తన స్వంత ప్రాణం రక్షించుకోవడం కోసం పిస్టల్‌తో భయపెట్టి తనన్ని తీసుకెళ్ళాలనుకోవటం పెద్ద షాక్

షాండ్లియర్ పడడం స్వామి ఏర్పాటేనని పరమేశ్వరానికి తెల్సు. రామ్‌లాల్ తప్పించుకోవటం తన ప్రిస్టేజికి సంబంధించిన విషయంగా భావించి అక్కడికక్కడే మరణాన్ని ఏర్పాటు చేశాడు స్వామి. పోలీసులకి ఎప్పటికయినా దొరికిపోయి రహస్యాలు చెప్పేస్తాడేమోనన్న భయం కూడా వుండి వుండవచ్చు. అదికాదు పరమేశ్వరం ఆలోచిస్తున్నది. రామ్‌లాల్‌ని బలిపెట్టడం కోసం తన ప్రాణాలు పోయినా కూడా ఫర్వాలేదనుకున్నాడు స్వామి? లేక తనని రామ్‌లాల్ బారినుంచి తప్పించటానికి యిలా చేసాడా? అతను పోయినా ఫర్వాలేదు. రామ్‌లాల్ మాత్రం బ్రతక్కూడదు అనే నిర్ణయంలో స్వామిగాని ఇలా చేసివుంటే అది మరింత పెద్ద శాక్.

స్వామి మాత్రం నిర్వికారంగా వున్నాడు. రామ్‌లాల్ దగ్గరికి వచ్చి పరీక్షించి చూశాడు. అప్పటికి సి.బి.ఐ చీఫ్ కూడా తేరుకున్నాడు. జరిగింది యాధృచ్ఛికమని అతడికీ నమ్మకం కలగలేదు అప్పటికే రామ్‌లాల్ చెప్పిన దాన్ని బట్టి స్వామి మీద అనుమానం కలిగింది తన గుండుని తడుముకున్నాడు. ఏదో తెలియని కసి. ప్రవల్లిక తనని చూసి నవ్వుతున్నట్లు అనిపించింది. చేతుల్లో దొరికిన బలమైన సాక్ష్యం జారిపోయింది ఏమీ నిరూపించలేడు. అసలిదంతా తనకి సంబంధం లేదనీ యాధృచ్ఛికమనీ అంటాడు స్వామి అన్నాడుకూడా.

చేసిన పాపానికి మనిషి భూమ్మీదే కర్మఫలం అనుభవించాలంటారు. ఈ రామ్‌లాల్‌కి ఇంత దారుణమైన చావు రాసి పెట్టి వున్నది కాబోలు. లేకపోతే ఇంత బలమయిన షాండ్లియర్ అలా జరిపడం ఏమిటి? ఇప్పుడేం చేస్తారు చీఫ్? పోనీ ఇతడితోపాటు ఇంకెవరయినా వున్నారా? అన్నాడు స్వామి.

లేరు అన్నాడు చీఫ్ కసి అణుచుకుంటూ.

లేరా? బ్యాడ్‌లక్ ఇప్పుడేం చేస్తారు?

చీఫ్ జవాబు చెప్పలేదు. చెప్పటానికేం లేదు. రామ్‌లాల్ శవాన్ని పోస్టుమార్టం చెయ్యటం ఆక్సిడెంటల్ డెత్‌గా ఫైలు మూసెయ్యడం అంతే చేసేది. ఫోటోలు తీశారు శవాన్ని తతంగం అరగంటలో పూర్తయింది. అంబులెన్స్‌లో శవాన్ని తీసుకెళ్ళిపోయారు. అయిపోయింది.

చీఫ్ ఇంటిలో ప్రవేశించగానే పూజ గదిలోకి వెళ్ళాడు. రామ్‌లాల్ మరణం అతన్ని వెంటాడుతోంది. ప్రవల్లిక ఇచ్చిన క్యాసెట్‌లో మాటలు ఇంకా వినబడుతున్నాయి. రామ్‌లాల్ చెప్పినదంతా నిజమైతే స్వామిలాంటి భయంకరమైన మేక వన్నెపులి దేశంలో మరొకడు ఉండడు గది అల్మైరాలో దేముడి ముందు దీపం వెలుగుతోంది. తనలాంటి వాళ్ళ మనసుల్లో అది వెలిగితే ఎంత బావుండును? డబ్బుకోసం కొంతమంది పదవీకాంక్షతో కొంతమంది తప్పుదారులు పడితే తనలాంటి వాళ్ళు మూఢభక్తితో అంతకన్నా అపాయకరమైన ఆఫీసర్లుగా తయారవుతున్నారు.

చేతులు జోడించి భగవంతుడా నన్ను క్షమించు అనుకున్నాడు మనసులో తాయెత్తు

బయటకొచ్చాడు.

*                                        *                                        *

హడావుడి అంతా పూర్తయ్యాక తమ రహస్య ఛాంబర్‌లో స్వామి పరమేశ్వరం కూర్చుని వున్నారు.

ఏం పరమేశ్వరం? అంత పెద్ద క్రిమినల్ లాయర్‌వి నువ్వే ఇంకా జరిగిన దానిలోంచి తేరుకోలేదనుకుంటాను?

పరమేశ్వరం నవ్వాడు. నిజమే అంతా అదోలా అయిపోయింది.

రామ్‌లాల్ నిన్నే అడ్డం పెట్టుకుని బయట పడతాడనుకోలేదు. డామిట్! స్వామిద్రోహి తగినశాస్తి జరిగింది!!! వాడుగానీ పోలీసుల బారిన పడివుంటే రెండు నిముషాల్లో అన్నీ చెప్పేసి వుండేవాడు. పరమేశ్వరం మన పునాది కాస్త కదులుతున్నట్లు అనిపిస్తూంది నాకెందుకో.

రేపే విజయదశమి మనం ఏర్పాటు చేసిన హోమ ప్రవేశంలో ఇక మీకు తిరుగులేదని నేను అనుకుంటున్నాను.

కొన్ని లక్షలమంది అక్కడకు చేరుకోవచ్చు. కొందరికయినా అనుమానం రాదా? గొడవ చెయ్యరు కదా?

పరమేశ్వరం నవ్వేడు. కొన్ని లక్షలమందికి సంబంధిచిన విషయంపై కొద్దిమంది గొడవ చేయటమన్నది ప్రజాస్వామ్యం మొదలయిన రోజు నుంచీ వుంది. అదే ప్రజలకి ఇంటరెస్టు తిట్టించుకోవటం కూడా పావులారిటీలో ఒక భాగం అని నాయకులు ఎప్పుడో గ్రహించారు. కొన్ని లక్షలమంది చేత ఎన్నుకోబడిన ఒక పార్టీ ప్రతినిధులు అసెంబ్లీలో పార్లమెంటులో మరికొన్ని లక్షలమందిచే ఎన్నుకోబడిన మరొక పార్టీ ప్రతినిధుల్ని తిడితే ఇద్దరు వేర్వేరు సభల్లో ఒకర్నొకరు తిట్టుకుంటే కొన్ని కోట్లమంది ప్రజలు నోట్లో వేలేసుకుని చూడడం మనకి కొత్తకాదు. ప్రజల్లో ఈ అజ్ఞానం పెరిగినంత కాలం మనకేం ఫర్వాలేదు. అంతవరకూ ఎందుకు? నన్ను లుచ్చా అన్న మంత్రి పరమలుచ్చా. నేను మంత్రిగా వున్నప్పుడు నా సహచరుడిగా వుంటూ పదికోట్లు తినేయటం నాకు తెలుసు అంటూ పార్టీనుంచి బయటకొచ్చిన మరో మాజీమంత్రి సదరు మాజీమంత్రి తమ పార్టీలో వున్నప్పుడే ఇరవై కోట్లు తినేసేడంటాడు. అధికారంలో వున్న మరో మంత్రి. మొత్తం మీద ఇద్దరు మంత్రులూ కలిసో విడివిడిగానో ఒకేసారి ముప్పై కోట్లు తిన్నామని వాళ్ళే చెప్పుకుంటూండగా, ఇద్దర్నీ కలిసో విడివిడిగానో చెప్పెట్టి కొట్టక వాళ్ళా సభలకి హాజరవటం మన ఉబుసుపోక తనాన్ని సూచించటం లేదూ? మన దినపత్రికల్లో వార్తల్ని విభాగాలుగా విడగొడితే కామర్స్ ఎకనామిక్స్ ఇండస్ట్రీ ప్రగతీ అన్నీ కలిసి పది శాతం కన్నా ఎక్కువ వుండవు. తొంభై శాతం పనికిరాని పాలిటిక్సే వుంటాయి. వాడిని వీడూ, వీడిని వాడూ ఎలా తిట్టుకుంటున్నాడో వ్రాసి పత్రికాధిపతులు సొమ్ము చేసుకొంటున్నారు. ఇదంతా పొలిటికల్ అవేర్‌నెస్ అని మీరనొచ్చు స్వామీ. ఎంత మాత్రం కాదు ఒక నియోజక వర్గంలో వందమంది

అందులో ఇరవై మంది వ్యాపారస్తులు ఇరవై మంది టీచర్లు, ఇరవై మంది రచయితలు వున్నారనుకోండి వారందరూ కలిసి నూరు శాతం ఓట్లు వేసి ఏకగ్రీవంగా ఎన్నుకొన్న అధినేత ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామన్న ఉద్దేశ్యంతో ....... గుమాస్తాలు పదింటికి ఆఫీసుకి రాకపోయినా టీచర్లు ప్రైవేటు చెప్పినా డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టినా కఠిన శిక్షలు వేస్తామనీ వ్యాపారస్తులు మోసం చేసినా రచయితలు సెక్సూ వాయిలెన్సూ వ్రాసినా ఉరిశిక్ష వేస్తామనీ ఆర్డినెన్స్ జారీ చేశాడనుకోండి. మరుసటి ఎన్నికల్లో అతడికి ఒక్కటంటే ఒక్క ఓటు రాదు. జాతి మొత్తానికి మంచి పని చేసినా తనకి పర్టిక్యులర్‌గా నష్టం కలిగించే పనిని ఓటరు సహించలేడు. త్యాగం కన్నా స్వార్థం మామూలు ఓటరునే ఇంతలా ప్రభావితం చేస్తున్నప్పుడు తెలివైనవాడు తను మిగతా వారిని ఎక్స్‌ప్లాయిడ్ చేస్తే తప్పేమిటి అన్నదానికి లోనవుతున్నాడు. ఇటువంటి ఓటింగ్ సిస్టమ్‌ని నమ్ముకున్న ప్రజలు మీరు అగ్నిలోకి దూకి బయటకొచ్చినా నమ్ముతారు. నీళ్ళలో దూకి పాతాళానికి వెళ్ళొచ్చానని చెప్పినా నమ్ముతారు. ఎవరు స్వామీ మిమ్మల్ని ఈ దేశానికి నియంత కాకుండా ఆపగలిగేది? రమ్మనండి చూద్దాం. రాముడినీ సీతనీ వెండి తెరమీద డిస్కో డాన్స్ చేయించి డబ్బు చేసుకున్నాడో నిర్మాత రామాయణాన్ని బూతుగా వర్ణించింది రచయిత్రి. సెక్యులరిజం ప్రాతిపదిగ్గా నిర్మితమైన మన దేశంలో మరే మతాన్నయినా మరే మతపు దేవుణ్ణయినా దమ్ముంటే ఒక్కమాట అనమనండి చూద్దాం అదే పాయింట్‌ని మీరీ క్షణం క్యాష్ చేసుకోబోతున్నాడు. పోనివ్వండి స్వామీ ఈ దేశాన్ని ఈ ప్రజల్ని మట్టిగొట్టుకు పోనివ్వండి కనీసం ఈ బూడిద లోంచయినా ఓ కొత్త ప్రజ ఉద్భవిస్తుందేమో చూద్దాం.

అతడి గొంతు ఆవేశంతో వనికింది. ఎందుకో తెలియకుండా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆలోచించగలిగితే దాని వెనుక కారణం కూడ బోధపడుతుంది. నలుగురిలో ఇద్దరు జారిపోయారు. పదవి పోవడంతో ఒకరు ప్రాణభయంతో ఒకరు పోయారు. ఒక తనొక్కడే మిగిలాడు. తెలివి. తెలివి ఎప్పుడూ విషయాన్ని అనలైజ్ చేస్తుంది. చెయ్యనంత కాలం ఫర్వాలేదు. చెయ్యటం మొదలుపెడితే అంతా బాధే. అందుకే జ్ఞాన దంతము వచ్చేటప్పుడు బాధపెడతాయన్నాడొక రచయిత. అతనికి దు:ఖం కలుగుతోంది. ఫ్రస్టేషన్ కలుగుతోంది.

అతడంత ఆవేశపడడం, అంతలా మాట్లాడడం ఎప్పుడూ చూడని స్వామి ఆశ్చర్యాన్ని మనసులోనే దాచుకుని అతడి భుజం తడుతూ సర్లే చాలా రాత్రయింది. పొద్దున్నే కలుసుకుందాం అంటూ వెళ్ళిపోయాడు.

అప్పటికే బయట విశాలమయిన మైదానంలో కలకలం వినిపిస్తూంది. దూర ప్రాంతాల్నుంచి వస్తూన్న వాళ్ళు అక్కడికి చేరుకుంటున్నారు.

ప్రొద్దున్నే విజయదశమి.

ఇంకో ఆరు గంటల్లో లక్షలాది జనం ఆ మైదానంలోకి చేరుకుంటారు.